జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం
01-05-2026



WWW. DASHANEWS. COM

## ఐసీఎస్ఈ, ఐఎస్సీ ఫలితాల్లో శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం



**దశ ఓయూ :** ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఐసీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో, ఐఎస్సీ ఇంటర్ ఫలితాల్లో విద్యానగర్ లోని శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులందరూ వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో పదోతరగతి సైన్స్ స్ట్రీమ్లో కొండి. బ్రిందా రోహన్ 98.2 శాతం, హర్షిక 95.6 శాతం, కామర్స్ స్ట్రీమ్లో బొర్ర. నిత్యాంగిరెడ్డి 95 శాతం, వీర ఎన్. బల్దేవ్ 94 శాతం మార్కులతో స్కూల్ టాపర్స్ గా నిలిచారు. గత 22 సంవత్సరాలుగా తమ స్కూల్ వంద శాతం ఫలితాలను సాధిస్తుందని స్కూల్ యాజమాన్యం పేర్కొంది. ఐఎస్సీ ఇంటర్ ఫలితాల్లో సైన్స్ స్ట్రీమ్లో శ్రీవైష్ణవి 96.4 శాతం, ఎం. కునాల్ కుమార్ 92.2 శాతం, కామర్స్ స్ట్రీమ్ లో లలిత శృతి 94.2 శాతం, గౌరవ్ లోయ 89.8 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. గత 16 సంవత్సరాల నుంచి ఇంటర్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చలమైరెడ్డి, హెడ్ మిస్ట్రీస్ జయశ్రీ పేర్కొన్నారు. పిల్లలను విద్యతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు తాము నిరంతరం క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు.

## అబ్దుల్లాపూర్ మెట్ ZPHS విద్యార్థికి ఘన సన్మానం



**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్సి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థి ఇమ్రాన్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. పదవ తరగతి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇమ్రాన్ కృషిని అభినందిస్తూ అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ విద్యార్థికి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థికి ప్రోత్సాహకంగా ₹5,000/ నగదు బహుమతిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుదలతో చదివితే గొప్ప ఫలితాలు సాధించవచ్చని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ మండల విద్యాధికారి జగదీశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు సురేఖ, రజిని తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు. ఇమ్రాన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

## పదవతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి రెండవ స్థానం పొందిన విద్యార్థిని రిత్వికని అభినందించిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి



**దశ సూర్యాపేట ప్రతినిధి:** విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, యాజమాన్యాలకు మంచిపేరు తీసుకురావాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే రెండో ర్యాంకు సాధించిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్తె, సూర్యాపేట జయ స్కూల్ విద్యార్థిని రిత్వికను మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు.

## పదవ తరగతి ఫలితాలలో నారాయణ వెస్ట్ మారేడ్‌పల్లి విద్యార్థుల ప్రభంజనం



**దశ ఓయూ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 202526 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో నారాయణ వెస్ట్ మారేడ్‌పల్లి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి 100% ఉత్తీర్ణతతో విజయ దుందుభి మ్రోగించారు. ప్రథమ స్థానంలో: 580/600 సాయి గౌతమ్ పట్నాయక్, ద్వితీయ స్థానంలో: 579/600 సంజన, తృతీయ స్థానంలో: 574/600 మోహిత్ నిలిచారు. గురువారం నిర్వహించిన ఈ విజయోత్సవ వేడుకలలో ఏజీఎం పురుషోత్తమ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

❖ ఘనంగా సుదర్శన నారసింహ ఇష్టి.




**దశ సూర్యాపేట ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు యాగశాలలో ద్వార, తోరణ, ధ్వజ కుంభ ఆరాధనలు, మూల మంత్ర హోమములు నిర్వహించారు. మేళ తాళాల మధ్య బలిహరణ నిర్వహించి నిత్య పూర్ణాహుతి జరిపారు.
గురువారం శ్రీ నరసింహ స్వామి జయంతి స్వాతి నక్షత్రం కూడా కలిసి రావడంతో శ్రీ సుదర్శన నరసింహ ఇష్టి యాగం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాల ఆచార్యులు నరసింహ స్వామి వైభవాన్ని ప్రజలకు వివరించారు అనంతరం పూర్ణాహుతి నిర్వహించి తీర్థప్రసాదాలు మరియు తదియారాధన అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయంలోని ప్రవచన మండపంలో ఎదుర్కోలు మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

### నేడు కళ్యాణ మహోత్సవం

బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు బ్రహ్మోత్సవ కళ్యాణం నిర్వహించనున్నట్లు వేణుగోపాలచార్యులు మరియు కార్యనిర్వహణాధికారి వై శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించవలసిందిగా వారు కోరారు.

# పని చేయడం మన బాధ్యత.. ఫలితం అదే వస్తుంది




❖ రిటైర్మెంట్ కార్యక్రమంలో భావోద్వేదనికి లోనైన సిపి సుదీర్ బాబు.

**దశ, ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం 3వ బెటాలియన్లో ఫ్యూచర్ సిటీలో గౌరవ వందనం స్వీకరించిన కమిషనర్ జి. సుధీర్ బాబు గురువరాం ఇబ్రహింపట్నం 3వ బెటాలియన్లో రిటైర్మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అందరి సహకారం వల్లే ముందుకు కోన సాగడం జరిగింది. ఈ పెరేడ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దాదాపు 31 సంవత్సరాల కాలం వివిధ హోదలలో పని చేయడం జరిగిందని బావోగ్వేదనికి లోనైయారురు. పని చేయడం మన బాధ్యత ఫలితం అదే వస్తుంది. ప్రతి స్థాయి నుండి మనం చేసే పనిలో ఎత్తు పల్లాలు ఉంటాయి వాటిని అధిగమించి ముందుకు సాగాలి. పోలీస్ శాఖలో ఎవరికి రాని అవకాశాలు నాకు మాత్రమే దక్కాయి. వివిధ కమిషనరేట్ పరిధిలో నాలుగు సార్లు సిపిగా విధులు నిర్వహించడం జరిగింది . పూర్వ రాచకొండ ప్రస్తుత ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ను నెంబర్ వన్ స్థానాన్ని అందిపుచ్చుకున్నాం. క్రైమ్, సైబర్ నేరాలు ,ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణ కల్పించడంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన పోలీస్ అధికారుల పాత్ర కీలకం అందరు సమిష్టి కృషితోనే ఫలితాలను సాధించాం అని సిపి సుదీర్ బాబు అన్నారు.

# అమీర్‌పేట్‌లో చలివేంద్రం ప్రారంభించిన దిశా లా ఫర్మ్

**దశ,హైదరాబాద్:** తెలంగాణలో ప్రముఖ న్యాయ సేవల సంస్థగా గుర్తింపు పొందిన దిశా లా ఫర్మ్ అధినేత డా. నాగేశ్వరరావు పూజారి, సామాజిక బాధ్యతపై తన కట్టుబాటును మరోసారి చాటుతూ అమీర్‌పేట్‌లో చలివేంద్ర సేవా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అమీర్‌పేట్‌లోని కేఎల్ఎం షాపింగ్ మాల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి న్యాయవేత్తలు, స్థానిక నాయకులు, సమాజ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయడం ప్రతీ సంస్థ బాధ్యత అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ సుమారు 1000 మందికి తాగునీరు, శీతల పానీయాలు అందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అడ్వకేట్ నాగేశ్వర రావు పూజారితో పాటు స్థానిక నాయకులు, సంఘాల పెద్దలు మరియు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# తాగునీటి కష్టాలకు చెక్

**దశ, మణుగూరు:** మణుగూరు మండలంలోని అరుంధతి నగర్ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ నూతన వాటర్ ట్యాంక్ ద్వారా అరుంధతి నగర్‌లోని సుమారు 130 కుటుంబాలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన మంచినీటి సదుపాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడంతో పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఆర్ఐ గోపి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు. అలాగే మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సర్పంచులు కలబోయిన మాధవరావు, పాల్వంచ రాములు, జిల్లా జనరల్ సెక్రెటరీ పోలమూరి రాజు, ఐఎన్‌టీయూసీ నేతలు సామా శ్రీనివాస రెడ్డి, గణేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ధాన్యం తరుగు వివాదంతో ఉద్రిక్తత



❖ 5 కేజీల కోతపై రైతుల ఆందోళన
❖ అధికారుల తీరుపై విమర్శలు
❖ వైస్ చైర్పర్సన్ జూపల్లి రంగప్రవేశం
❖ కొలిక్కి వచ్చిన వివాదం

**దశ, అశ్వారావుపేట:** నియోజకవర్గ కేంద్రం అశ్వారావుపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం తరుగు అంశంపై వివాదం చెలరేగి, రైతుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతులు కేంద్రంలో 5 కేజీల వరకు తరుగు తీస్తుండటంతో పాటు అదనంగా ముఠా కూలీ కూడా చెల్లించాల్సి వస్తోందని ఆరోపిస్తూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతుల వాదన ప్రకారం, 5 కేజీల తరుగు కారణంగా ఎకరానికి సుమారు రూ.5 వేల వరకు నష్టం వాటిల్లుతోందని, ఇది పూర్తిగా అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే నిబంధనల పేరిట అనవసర కోతలు విధించడం, అదనపు ఖర్చులు మోపడం వల్ల తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సహకార పరపతి సంఘం ఇన్‌చార్జి సీఈవో రాజశేఖర్ రెడ్డి రైతులతో మాట్లాడుతూ, "ప్రభుత్వ నిబంధనలు నచ్చకపోతే మీ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోండి" అని వ్యాఖ్యానించడంతో రైతుల్లో మరింత ఆగ్రహం చెలరేగింది. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన రైతులు ఒక్కసారిగా ఆందోళనకు దిగడంతో కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సమాచారం అందుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం ఉన్నతాధికారులతో ఫోన్‌లో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

తూర్పార పట్టిన వడ్లకు 5 కేజీల తరుగు విధించడం రైతులకు నష్టం కలిగిస్తోందని, గతంలో అమలులో ఉన్న విధంగా 3 కేజీల వరకు మాత్రమే తరుగు తీసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పరిస్థితి శాంతించింది. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా జూపల్లి రమేష్ మాట్లాడుతూ, చిన్న చిన్న పరిపాలనా లోపాల వల్ల ప్రభుత్వంపై అనవసర విమర్శలు వస్తాయని, రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వారికి అండగా నిలవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రమోద్, పసుపులేటి రామస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం 01-05-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




# నిబంధనలను తుంగలో తొక్కిన డిపిఆర్ఓ..?

- అక్రిడేషన్ కమిటీలో అవకతవగలపై కలెక్టర్కు ఫిర్యాదు
- జిల్లా కలెక్టర్ ను తప్పుదోవ పట్టిస్తున్న అధికారి
- అక్రిడిటేషన్ కమిటీ లో అనర్హులకు చోటు
- తప్పులు దొర్లాయంటూ బుకాయింపు....



**దశ, భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేయాల్సిన జర్నలిస్టులను పరిశీలించి నిర్ధారించాల్సిన అక్రిడిటేషన్ కమిటీ పూర్తి తప్పుల తడకగా డి పి ఆర్ ఓ పూర్తి చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కమిటీని పునః పరిశీలన చేసి మార్పులు చేయాల్సిందిగా శనివారం టీయూడబ్ల్యూజే ఐజేయు కమిటీ నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ని కలిసి వివరించారు. కలెక్టర్ కమిటీని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు..

మూడు రోజులుగా సెలవులో ఉన్నానంటూ మాట దాట వేస్తూ కలెక్టర్ గారు చూడమని చెప్పారు తప్ప మార్చమని చెప్పలేదు అంటూ తాను చేసిన కమిటీ ఫైనల్ అంటూ మీటింగ్ కు రావాలని సభ్యులకు ఫోన్లు చేయడంతో కలెక్టర్ ను కలిసేందుకు టి యు డబ్ల్యు జే ఐ జేయు నాయకులు బుధవారం కలెక్టరేట్ కు వచ్చారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కు పరిస్థితులు వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ గారికి పూర్తి విషయాలు వివరించి సమస్యను తీరుస్తామని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు కమిటీ నాయకులు ఇమంది ఉదయ్ కుమార్ జనుమాల రమేష్, ఏర్పుల సుధాకర్ రావు, ఎర్రా ఈశ్వర్, పురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి ఘన వీడ్కోలు

**దశ, పినపాక:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో నాలుగు సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ దిలీప్ కుమార్, కానిస్టేబుల్ సారయ్యలకు సాధారణ బదిలీల నేపథ్యంలో స్నేహపూర్వకంగా వీడ్కోలు పలికారు. దిలీప్ కుమార్‌ను కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు, సారయ్యను భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఈసందర్భంగాపోలీస్‌స్టేషన్‌లోఏర్పాటుచేసినకార్యక్రమంలో సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సురేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడూళ్లబయ్యారం సిఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇద్దరూ తమ సేవా కాలంలో క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించి స్టేషన్‌కు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహచరులు వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, జ్ఞాపికలు అందజేశారు.

# నూతన వాటర్ ట్యాంకును ప్రారంభించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు:** మణుగూరు మండలంలో అరుంధతి నగర్లో నిర్మించిన OHSR 60 వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్ భగీరథ నూతన వాటర్ ట్యాంకును గురువారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా వాటర్ ట్యాంకుల నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి తగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మాధవరావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ జైత్రయాత్ర మొదలు కావాలి

- BRS నియోజకవర్గ ఇన్చార్జ్ వనమా వెంకటేశ్వరరావు




**దశ, కొత్తగూడెం:** కొత్తగూడెం నియోజకవర్గం BRS పార్టీ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు BRS పార్టీ జిల్లా కార్యాలయంలో పోలింగ్ బూతు లెవెల్ సమావేశం గురువారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మే నెల లో ఏదైతే SRI కార్యక్రమం జరగనుందో దాంట్లో BRS నాయకులు కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు ఎవరైతే ఇప్పుడు పోలింగ్ బూతు లెవెల్ ఏజెంటగా ఉంటారో చాలా యాక్టివ్ గా ఉండాలని ఓటర్లను గుర్తించాలన్నారు. ముఖ్యంగా దొంగ ఓట్లను గుర్తించాలని త్వరలో శిక్షణ తరగతులు ఉంటాయని చాలా జాగ్రత్తగా ఇచ్చిన తరగతులను అర్థం చేసుకొని SRI కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని అనంతరం రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోను జాగ్రత్తగా వ్యవహరించి దొంగ ఓట్లు మరియు ఇంకా ఎక్కడా కూడా పోలింగ్ స్టేషన్ల వద్ద రిగ్గింగ్ జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలింగ్ బూతు ఏజెంట్ల పై ఉంటుందని అన్నారు. అంతేకాకుండా వివిధ రాష్ట్రాల్లో ఇటీవల లక్షల్లో దొంగ ఓట్లను తొలగించారని మన రాష్ట్రంలో మన నియోజకవర్గంలో కూడా దొంగ ఓట్లకు తావు లేకుండా చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పట్టణ మండల నాయకులు సర్పంచులు వివిధ హోదాల్లో ఉన్న BRS ప్రజాప్రతినిధులు BRS కార్పొరేటర్లు తాజా మాజీ ప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు బూతు లెవెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ టీచర్లకు 49 స్మార్ట్ ఫోన్ల, CMRF చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**దశ, కరకగూడెం:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కరకగూడెం మండలంలోని రైతు వేదికలో గురువారం అంగన్వాడీ టీచర్లకు 49 స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాలు గ్రామ స్థాయిలో బాలల అభివృద్ధికి పునాది వంటివని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసం మాత్రమే కాకుండా, వారి భద్రత మరియు సంరక్షణలో అంగన్వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ ఫోన్ల ద్వారా పిల్లల వివరాలను సమయానికి నమోదు చేయడం, పోషకాహార పర్యవేక్షణ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సమాచారాన్ని ట్రాక్ చేయడం వంటి సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు మరియు ఎలోప్మెంట్ కేసులు సమాజంలో ఆందోళనకర విషయాలని, వాటి నివారణకు సమష్టి కృషి అవసరమని అన్నారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎమ్మార్వో వట్టం కాంతయ్య, ఎంపీడీవో డి.వి. కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్ఫూర్తి, ఆర్ఐ, జిపిఓ, జిపి సెక్రటరీ, మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఎర్ర సురేష్, తొలెం నాగేశ్వరావు, రాందాస్ నాయక్, కృష్ణ, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చీమలపాడు, ఆర్ కొత్తగూడెం ఇసుకర్యాంపు సమస్యల్ని పరిష్కరించాలి

- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరి, రేసింగ్ కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండే పద్ధతిని మానుకోవాలి
- CPIML మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి




**దశ, కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చీమలపాడు ఆరు కొత్తగూడెం ఇసుక సొసైటీ కమిటీలు సమయం ముగ్గేయడంతో మహాజనసభల ద్వారా నూతన కమిటీ ఎన్నిక ఉన్నప్పుడు ఎన్ని కే అధికారుల సమక్షంలో జరిగినప్పటికీ ఉన్నత అధికారులు ఈ రాంపుల విషయంలో కాలయాపన చేస్తూ సొసైటీ సభ్యుల మధ్య గొడవలకు కారణమయ్యారని ఆయన విమర్శించారు. ఈ కాలయాపన ఆధారం చేసుకుని పాత కంపెనీ వారు కోర్టుని తప్పు దోవ పట్టించి ఇసుక ఆన్లైన్ పెట్టే కోర్టు ద్వారా ఆర్డర్ ని తెచ్చుకున్నారని ఆయన అన్నారు. ఇది ఇసుక నిబంధనలకు పిశాచటానికి విరుద్ధమైన విషం అని ఆరోపించారు. వాస్తవానికి ఈ సమస్య అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంతకాలం ఆగాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమార్కులతో జోడి కాకుండా వారి బాధ్యతలను వారు నెరవేస్తూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జాటోత్ కృష్ణ, కల్లూరు కిషోర్, వెంకటేశ్వర్లు, సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, చర్ల మండలం పార్టీ మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య, శ్రీ సిర్రాజు సొసైటీ అధ్యక్షురాలు ఇర్పా సామ్రాజ్యం, ఆర్ కొత్తగూడెం సొసైటీ అధ్యక్షురాలు అశ్విని, సుజాత, నాగమణి, నాగలక్ష్మి ,స్వప్న, పార్వతి, శాంతకుమారి, సరిత ,సత్యవతి, చిట్టెమ్మ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

# 6వ డివిజన్‌లో నూతన అంగన్వాడి కేంద్రం ఘనంగా ప్రారంభం




**దశ, ఖమ్మం:** ఖమ్మం నగరం పరిధిలో గల 6వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖమ్మం నగర మేయర్ పూనుకొల్లు నీరజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లల ఎదుగుదలకు కూడా విటమిన్‌లు ఉండే ఆహారం అందించాలన్నారు. పాలు, గుడ్డు తదితర పౌష్టిక విలువలు ఉండే వాటిని క్రమం తప్పకుండా పెట్టాలన్నారు. వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు మరియు డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గుండాల మండలంలో ఏసీబీ రైడ్స్

- డి.ఎస్.పి వై.రమేష్ కు పట్టుబడ్డ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరేష్



**దశ, గుండాల:** గుండాల మండలంలో గురువారం ఏసీబీ అధికారులు అకస్మికంగా దాడులు నిర్వహించారు. గుండాల మండలం నడిమిగూడెంలో పోడు రైతు వద్ద నుండి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఫారెస్ట్ బీట్ అధికారి బాణోత్ నరేష్ పట్టుబడ్డాడు. ఖమ్మం జిల్లా ఏసిబి డి.ఎస్.పి వై.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో గుండాల ఫారెస్ట్ ఆఫీసర్ బానోతు నరేష్ పట్టుబడం ఏజెన్సీ మండలాలైన గుండాల, ఆళ్లపల్లిలో తీవ్ర చర్చనయాంశం అయింది.

# ముఖ్య కార్యకర్తల ప్రత్యేక సమావేశం జయప్రదం చేయండి

**దశ, భద్రాచలం:** దుమ్మగూడెం మండలంలోని లక్ష్మీనగరంలోని కొత్త ఫంక్షన్ హాల్ నందు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండల BRS పార్టీ ముఖ్య కార్యకర్తల ప్రత్యేక సమావేశం కలదు. ఈ సమావేశంలో 3 మండలాల ముఖ్య కార్యకర్తలు తప్పక పాల్గొనవలసిందిగా భద్రాచలం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు మానే రామకృష్ణ, ఆర్. రాంప్రసాద్‌లు గురువారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్, BRS పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు హాజరై, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. కావున భద్రాచలం నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మరియు అభిమానులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా కోరారు.

# భద్రాచలం పిలుస్తోంది

- మే 3 హిందూ సమ్మేళనం
- సమ్మేళనం జయవంతానికి భారీగా తరలిరండి

**దశ, భద్రాచలం:** భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి భద్రాచలం, సారపాక (సాకేతపురి), దుమ్ముగూడెం పరిసర ప్రాంత ప్రజలు ప్రాంతాల నుండి హిందూ బంధువులు అశేష సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో నేడు భద్రాచలం పట్టణంలోని తెలంగాణ టూరిజం హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సమావేశంలో హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, "గడప లోపల కులం గడప దాటితే మనమంతా హిందువులం!" అనే నినాదంతో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఉన్న భేదాలను పక్కన పెట్టి, ఐక్యంగా నిలబడే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేర్చడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ఈ సమ్మేళనం చారిత్రాత్మకంగా నిలవాలని




ఆకాంక్షించారు. అలానే శ్రీ శివనాగస్వామి గారు మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడం, ధార్మిక మరియు సాంస్కృతిక విలువలను రక్షించడం ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని వివరించారు. భిన్నతలు ఉన్నా మనమంతా ఒకటే అన్న భావనతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం భద్రాచలం నగర ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారి నాగభూషణ శాస్త్రి, కుంజా సంతోష్, గోపి కిషోర్, ఎ.శ్రీనివాస రెడ్డి, సిద్ధార్థ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.